చిలిపిచేష్టలతో—చిడిముడి పలుకులతో

# ★ చెలిమి కలిపిన మా చిన్నారి బేబీ!

● ఆ. జయప్రదాదేవి ●

మధ్యాహ్నం మూడుగంటలవుతుంది. అప్పుడే రైలు దిగి వచ్చీరావటంతోనే, "బేబీకి ఎలా ఉందని" అడిగారాయన. "ఏమీ ఫరవా లేదన్నారు డాక్టరుగారు. "టెంపరేచరుకూడా 99 కి వచ్చింది" అన్నాడు చేతిలో ఉన్న యటాచి కేసునందుకుంటూ. ఇంతలో నౌక తెచ్చి చెంబందుకుని కాళ్లు కడుక్కొని "అబ్బ! భలే శ్రమైపోయింది ఈ ఎండలో; దానికితోడు ఇక్కడ ఎలా ఉన్నదో అనే ఆత్రం ఒకటి" అంటూ అక్కడే ప్రక్కగదిలో ఉన్న ఈజీచైరులో నెమ్మదిగా కూర్చున్నారు.

"మీకు ఇంత త్వరగా రమ్మని వ్రాసేదాన్ని కాదు. అయినా జ్వరం హెచ్చటంతో కంగారు పడ్డాను" అని లోపల ఉన్న మా బేబిని తీసుకు వచ్చి ఒళ్లో కూర్చోబెట్టాను. మా బేబి సంవత్సరంన్నర బిడ్డ. ఇంకా సరిగా మాటలుకూడా రావు. అయినా ఆ వచ్చీరాని భాష మాకు మాత్రం బాగానే అర్థమవుతూ ఉండేది.

"నాన్నరూ! బిస్కత్తులు" అంటూ తన చిన్ని వ్రేళ్ళతో వాళ్ళ నాన్నగారి చొక్కా గుండీలను పరీక్ష చేస్తోంది బిడ్డ" ఇదిగో యటాచి కేసులో ఉంది బిస్కట్టు పొట్లాం; తీసివ్వు" అని నాతో చెప్పారు. నేను పొట్లాం ఇవ్వగానే అది పట్టుకుని "మామ్మా, నా బిస్కత్తులు" అంటూ తప్పటడుగులు వేసుకుంటూ చకచకా లోపలికి వెళ్ళిపోయింది మా అమ్మాయి.

"ఏం, మరీ అంత అలసటగా కన్పిస్తున్నారు" అనటంతో మా సంభాషణ ప్రారంభమైంది.

"ఆఁ రాత్రంతా నిద్రే లేదు, ఆ హడావుడిలో" అన్నారు విసుక్కుంటూ.

అసలు క్రిందటిరాత్రి విషయం జ్ఞాపకం వస్తేనే నాకు అసహ్యం, కోపమూ వస్తోంది. దాని మీద ఆయన ఏమాత్రమూ సందేహమే లేకుండా, నాతో చెప్పటం చూస్తే, మరీ ఆవేదన కలిగింది. దాంతో అప్పటివరకూ ఎంతో ఉత్సాహంగా ఉన్న నేను విషకటిగా మారిపోయాను. ఆయన మాత్రం కులాసాగా అవీఇవీ అడుగుతూనే ఉన్నారు. మరి నాకేమో తలకెక్కలా. పైగా 'ఛీ, దౌర్భాగ్యపు బ్రతుకు; విలువ లేనిచోట, చొరవచేసుకోబోతున్నావ్" అని ఎవరో చెవి దగ్గర బిగ్గరగా అరుస్తున్నట్లయింది. అంతటితో నేను ఆయన ప్రశ్నలకు సరైన సమాధానమే ఇవ్వలేకపోయాను.

ఆయన నేనాందోళనగా ఉండటం గ్రహించి "ఏమిటీ, అలా ఉన్నవే; కూర్చో" అంటూ ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చోమని సంజ్ఞ చేసారు. కాని, ఏం లాభం; ఆయన చూపే ఆదరాన్ని అందుకోలేకపోయాను. ఆయన్ని నోటికి వచ్చిన మాటలతో గట్టిగా దూషించాలనిపించింది. చదువుకున్న మనిషి, అందులోనూ దూరదృష్టితో ప్రతి విషయాన్ని ఆలోచించిగాని చేయని మనిషి, ఇన్నాళ్లనుండి వివేకవంతుడని నేను ఆశిస్తున్న మనిషీ, చేశాడంటే కోపంరాదూ మరి? నిజంగా నేనే కాదు; ఆ పరిస్థితుల్లో ఎవరున్నా, అలాగే జరిగేదనుకుంటాను. ఆయనకు బేబి అంటే బహిప్రాణం. అలాంటావిడ ఆరోగ్యంకూడా సరిగా లేనప్పుడా, ఇలాంటి బెడదలు నెత్తిమీద పెట్టుకోవటం? పోని, అది అలా ఉంచి నాతో ఆలోచించనైనా ఆలోచించారా? ఏమీ లేకపోయింది. దాంతో నాకు జరిగిన పరాభవాన్ని కూడా ఏకీభవించి నన్ను మరీ అంధురాలిని చేసాయి.

"స్వయంగా కావాలని చేసి, ఇంకా అలా అడుగుతారే."

"అంటే నీ ఉద్దేశ్యం? ఇప్పుడు నేనేమి చేసానంటావ్?"

"సరి; ఇంక మరి మీరు ఆ విషయాన్ని గురించి మాట్లాడవద్దు. చేసింది పరాభవం, చూపింది నీచత్వం, ఇంకా మాట్లాడాలా, దాన్ని గురించీ" అన్నాను విసుగ్గా.

'అలా కాదు. నీవు చాలా విసుగ్గా ఉన్నావు. ఇలా కూర్చో' అని కుర్చీలో కూర్చోబెట్టారు.

"ఇదుగో, నా మీద అలా నిష్ఠూర్యంగా మాట్లా

దతావేం. నేను నీతో చెప్పే వెళ్ళాగా" అన్నారు.

"నాతో మీరేం చెప్పారూ? రావద్దనేగా?"

"అవును, ఇలా జరుగనుంది మన ఇంట్లో. కొన్ని ఇబ్బందులమూలంగా ఇక్కడే నిర్ణయించారు అని నేను విశదంగానే చెప్పాను కదూ" అన్నారు ఆయన ప్రశాంతంగానే.

కాని నాకుమాత్రం ఏమీ బాగుండలేదా సమాధానం. మొదటినుండి ఆక్కడ కనబడుతూ ఉన్న పొరుపుదనం. అందులో ఆప్తులలో లెక్కింపబడవలసిన నన్ను పరాయిగా కనబర్చటమూ చూస్తే, నాకసహ్యం వేసింది. అంతకు పూర్వం అందరికంటే వాత్సల్యం పొందటానికి నేనగ్రస్థానం వహిస్తాననుకునేదాన్ని, నాకేమీ లోటుండదనుకునేదాన్ని. అలాంటి ఆశలన్నీ భగ్నం కావటం, చివరకు ఎంతో శాంతపరులనీ, దయార్ద్రహృదయులనీ-ప్రేమస్వభావులనీ, కలలు కంటూన్న నా భర్త ఇలా చూస్తూ ఊరుకునేటప్పటికి నేను సహించలేకపోయాను. నా ఆవేగాన్ని అపుకుంటూ "సరే ఇందులో సరిగా ఆలోచించుకుంటే, మీకూ కొంతవరకు చిన్నతనమే" అంటూ లోపలికెళ్ళి ఫలహారం, టీ తీసుకొచ్చి ఇచ్చాను. ఏదో ఆలోచించుకుంటూ, ఏమీ తోచకుండానే, నెమ్మది నెమ్మదిగా ఆ ప్లేటు ఖాళీచేసేసారాయన.

నిజంగా నా హృదయం ఉట్టుడికిపోయినట్లు ఉడికిపోతోంది. అయినా సంఘ వాతావరణం దానికి తోనె ఆయనకూడా ఏమీ చెయ్యలేక అలా ఊరుకున్నారులే" అని సర్ది చెప్పుకోవటానికి ప్రయత్నించాను. ఇంతలో వేడిగా ఉన్న టీ గ్లాసు అలా నోటి కందించి, వేడి భరించలేక ఒక్కమాటుగా కదిలేప్పటికి చింది బట్టలనిండా అక్కడక్కడా కొద్దిగా పడ్డాయి. గబగబా లేచి దులుపుకుని "ఇదుగో నన్ను బాధపెట్టకు నీ ఆందోళనేమిటో నిజంగా చెప్పు" అన్నారు.

అప్పటి ఆయన పరిస్థితి చూస్తే నిజంగా, ఇంత ప్రేమించే వ్యక్తి, ఎలా నన్ను అవమానించటానికి హర్షిస్తారా అనిపించింది. కాని జరిగింది వాస్తవం.

అబ్బ! ఇంత పరాభవాగ్నిలో బడి ఆవేదన పడుతుంటే ఆయన మనస్సుకు ఎలా తెలియకుండా ఉంటుందీ? కాదు; అయనకు తెలుసు. తెలిసికూడా ఏమీ చేయలేకపోయారు. అదేమని అడుగలేకపోయారు. స్వార్థపరుణ్ణి, అవుతానను కున్నారు. భార్యాలోలుణ్ణి అనిపించుకుంటానను న్నారు అంతే.

"ఏమిటీ, చెప్పవా ?" అని మళ్ళీ ప్రశ్న.

"ఇంకేం కావాలీ ? ఏడ్చి విందుకు చెప్పించుకున్నదట — వెనుక నా బోటిది. అలాగే ఉంది నా విషయమూను. నా ఇంట్లో అంటే నాకు ఒక రకమైన హక్కున్న ఇంట్లో, నా అవశ్యకత గానీ లేకుండా అలా చెయ్యటం; కనీసం కబురైనా లేకుండా ఎంత ధైర్యం! ఎంత నిర్లక్ష్యం; ఇలా చెయ్యటానికి!! దీన్నంతటినీ మీరు తృణప్రాయంగా ఎంచి, హాయిగా సంతోషంగా వారికవుసరమనుకున్నవన్నీ ఏర్పాటు చేయటం; భృత్యుల్లాగా కాదు; వారి కాప్తు గనుక చేసారన్న మాట. అవునా" అన్నాను ఆవేదన ఆపుకోలేక. ఇంతసేపూ తల కొంచెం క్రిందికి వంచి, వింటూ కూర్చున్నారు. కొన్నినిముషాలపాటు ఏమీ మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా "అవును; దానికి నేనేమి చెయ్యనూ ? అది వారి పని. వారు చేయునప్పుడు మనం జోక్యం కలుగజేసుకోవటం బాగుండదు" అన్నారు.

ఇక నాకు పుండుమీద కారం జల్లినట్లయింది.

"పాపం, మీరేమి చేస్తారూ ? వారి అవసరాలకు ఉచితంగా మీ కాప్తులు గనుక, ధనసహాయం చేస్తారు. హంగు ఏర్పరుస్తారు. అందుకు వారూ, అవుసరమనుకున్నవారు ఇక్కడే ఉన్నారుకదా, ఆమెతో మనకేం పనీ, అనుకున్నారు. పాపం; నిజమే, తప్పేముందీ'' అన్నాను ఆవేగాన్ని అణచుకోలేక.

ఇక ఆయనేమీ అనలేకపోయారు. అలాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయారు. "నిజంగా పాపం; చిన్నప్పటినుండీ కనీ, పెంచీ, పెద్దవారిని చేసి, విద్యాబుద్ధులు చెప్పినవారికంటే నిన్నగాక మొన్న వచ్చిన ఒక అమ్మాయిమీద ఎలాగా ఆధారపడిఉండటం ? అదే మాకు తప్పదు. ఇదంతా మీది కాదు, లోటు నాదే" అన్నాను.

ఆయన ఏమీ మాట్లాడకుండానే శూన్య ఆకాశంలోకి ఒకమారు, నేలవంక ఒకమారు అప్పుడప్పుడూ తన దృష్టులను మరల్చుతూ, ఏదో మాదిరిగా చూస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. నిజంగా అప్పుడాయన తికమక చూస్తే నాకే బాగుండలా. ఏం లాభం; నాతోపాటు ఆయనకూడా ఆందోళనపరచటం తప్పితే, ఇంకేమీ కన్పించలేదు. ఏలాగన్నా ఇంకో ధోరణిలో మార్చాలనుకుం

టున్నాను. ఇంతలోనే మా అమ్మాయి చేతులన్నీ మురికిచేసుకుని, ఒక చేత్తో పౌన్‌డాను పట్టుకుని రెండో చేతితో నోట్లో ఉన్న తన "పిసీసి"ను (రబ్బరుపీక) పట్టుకుంటూ, పౌన్‌డాను మొయ్యలేక మొయ్యలేక అవస్థపడుతూ "నాన, లూ, పోయె, చూలపోయె" అంటూ వచ్చింది. ఒక్క మాటగా ఇద్దరం వెనక్కి తిరిగి ఆమెను చూచాం. నవ్వు ఆగలా. ఫక్కున నవ్వారు. నవ్వేటప్పటికి, మా అమ్మాయి తనను చూచే నవ్వుతున్నాం అనుకుని, బిక్కమొఖం పెట్టి ఏడవటానికి తయారవుతోంది. ఇంతలోనే దగ్గరకు తీసుకుని ఎత్తుకునేటప్పటికి, ఆమె ఏడ్పల్లా నవ్వుగా మారింది. నవ్వుతూ "చూలపోయె, నాన్నాలూ" అంటూ మొదలుపెట్టింది. ఏమిటోనని చూద్దును కదా, అందులో ఉన్న చక్కెర, సున్నం, యాలుక లవంగాలు మొదలైనవన్నీ, ఇంక కలుపుకోనవసరం లేకుండానే తయారయి ఉన్నాయి.

"ఇదుగో చూడండి, పిల్లలు ఎలాంటి పనులు చేస్తారో" అన్నాను.

"అయినా, అవీ బాగానే ఉంటాయి. చూడు వాళ్లు ఎంత మురికి చేసుకున్నా బాగానే ఉంటారు" అన్నారు బేబిని ముద్దుపెట్టుకుంటూ.

"అవును, మీకు బేబంటే చాలా ప్రేమ. అందుకనే అలా అంటారు. బిడ్డ ముద్దయితే చెడ్డ పనులుకూడా ముద్దేనా ఏం ?"

బుగ్గమీద చిటిక వేస్తూ "కాదు; ప్రేమమయంగా కన్పించే బేబిని ఇవ్వగలిగిన నీవంటే ముద్దు" అన్నారు.

ఇద్దరం నవ్వాం. మా బేబి కూడా అర్ధమవుతున్నట్లుగానే తన చిన్నినోటిదగ్గర చెయ్యిపెట్టుకుని తమాషాగా ముద్దుగా నవ్వుతోంది.

ఆమె తన నవ్వుతో ప్రారంభించిన స్వరమాధుర్యంతో మా నవ్వు లయ కలిపింది. అప్పటివరకూ భిన్నదృక్పథాలమూలంగా, సంఘర్షణంలో నలిగిపోతున్న మా భిన్న హృదయాలు, తిరిగి ప్రశాంతతను పొందగలిగాయి. సామరస్యం కుదిరింది. మా బేబి తన చిలిపిపనులతో చిన్నిచిన్ని మాటలతో మళ్లా మమ్మలను ఎంతో దగ్గరగా ఎంతో సన్నిహితంగా చేర్చివేసింది.


తప్పకొనండి కుష్టు ★ బొల్లి నివారణకు

గ్యారంటీ చికిత్స

వాడబడుచున్నవి మా ఔషధరాజములే!

పతితపావనసంఘం

బరంపురం

అయ్యా,

......శ్రీ కృష్ణాశ్రమాన్ని నేను పతితపావన మందిరంగా భావిస్తున్నాను. కుష్టువ్యాధి పీడితమానవగాత్రాలను పునీతం చేయడంలో ఈ మందిరంవారి ఔషధాలు వాస్తవంగా పతితపావన ప్రభు దివ్యప్రసాదమే.

చిత్తగించవలెను.

(సం॥) జె. ఎం. రాత్ (అధ్యక్షుడు)

క్యాటలాగు ఉచితము!

రెడ్డి & కో., (రిజిష్టర్డ్)

H. O. గోపాలపురము (via) తణుకు, తూర్పు గోదావరిజిల్లా.